పేదింటి కల నెరవేరేనా?

- బీఆర్ఎస్ ప్రభుత్వం మారడంతో నిలిచిపోయిన పనులు
- చివరి దశ నిర్మాణంలో 252 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు
- పనులు జరగక నిలిచిపోయిన 248 ఇండ్లు
- ఇండ్ల దిక్కు కన్నెత్తి చూడని కాంగ్రెస్
- కోట్ల రూపాయల ప్రజాధనం వృథా

చివరి దశకు వచ్చిన బుల్ బెడ్‌రూమ్ ఇండ్లు

స్లాబ్ వరకు నిర్మాణం పూర్తయిన 248 డబుల్ బెడ్‌రూమ్ ఇంటి నిర్మాణాలు

నర్సాపూర్, డిసెంబర్ 23: పేదోళ్ల ఇంటి కల కలగానే మారనున్నది. పేదింటి కలను సాకారం చేయాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారంచుట్టారు. ముమ్మరంగా ఇండ్ల నిర్మాణ పనులు కొనసాగాయి. ఇంతలోనే ఎన్నికలు వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. అదే పేదలకు శాపంగా మారింది. అప్పటి వరకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల కోసం ఎదురుచూసిన లబ్ధిదారుల ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. నిర్మాణం పూర్తయ్యి చివరి దశలో ఉన్న ఇండ్లు పంపిణీకి నోచుకోక శిథిలావస్థకు చేరుతున్నాయి. గూడు లేక గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలకు డబుల్ బెడ్రూమ్ ఇల్లు కలగానే మిగిలిపోతుందా అనే అనుమానం కలుగుతున్నది.

500 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు మంజూరు

బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ నర్సాపూర్‌లోని వెల్దుర్తి మార్గంలో 500 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను మంజూరుచేశారు. మార్కెట్ యార్డు ఎదుట 252, మార్కెట్ వెనక భాగంలో 248 ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టారు. మార్కెట్ ఎదుటనున్న 252 ఇండ్ల బీఆర్ఎస్ హయాంలోనే నిర్మాణం దాదాపు పూర్తి దశకు వచ్చాయి. ఇందులో కరెంట్, నీరు, పెయింటింగ్, కిటికి అద్దాలు తప్పితే మిగతా పనులు పూర్తయ్యాయి. మార్కెట్ వెనక భాగంలోని 248 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో కొన్ని గోడలు స్లాబ్ వరకు పూర్తయ్యాయి. మరికొన్ని కొంతమేరకు స్లాబ్ వరకు ఉన్నాయి. 252 ఇండ్లలో చిన్నచిన్న పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని పేదలకు కోరుతున్నారు.

కోట్ల రూపాయల ప్రజాధనం వృథా?

కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన ఇండ్లను లక్షల ఖర్చుతో పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు వెనుకడుగు వేస్తున్నదని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. పేదోడి కలలతో రాజకీయం చేయకుండా ఇండ్లు పంపిణీ చేయాలని కోరుతున్నారు. గత ప్రభుత్వంలో నిర్మించినంత మాత్రానా పంపిణీ చేయకుండా ప్రజాధనం వృథా చేయవద్దని నర్సాపూర్ వాసులు వేడుకుంటున్నారు. కనీసం చివరి దశకు వచ్చిన 252 ఇండ్లను పూర్తి చేసి పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

సీఎం సారు.. ఓ సారి ఇటు చూడు

ఈ నెల 25న మెదక్ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి నర్సాపూర్ మీదుగా హెలిక్యాప్టర్‌లో మెదక్ వెళ్లనున్నారు. నర్సాపూర్‌లోని డబుల్‌బెడ్రూమ్ ఇండ్లపై కన్నేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. అసంపూర్తిగా ఉన్న ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి, పంపిణీ చేయాలని ఆశిస్తున్నారు.

బిల్లులు రాకనే పనులు ఆగిపోయాయి

డబుల్ బెడ్రూమ్ ఇండ్లకు బిల్లులు రాకనే కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. 248 ఇండ్లకు సంబంధించి రెండు బిల్లులకు గాను ఒక బిల్లు వచ్చింది. కాంట్రాక్టర్ వచ్చి పనులు మొదలు పెడతానని చెబుతున్నాడు. మార్కెట్ యార్డు ముందు భాగంలోని 252 ఇండ్ల పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. కరెంట్, పెయింటింగ్, చిన్నచిన్న పనులు మాత్రమే మిగిలాయి. దీనికి సంబంధించిన బిల్లులు రాలేదు. బిల్లు వచ్చాక మిగతా పనులు పూర్తి చేస్తామంటున్నాడు. ఈ ఇండ్లకు రూ.12.5 కోట్ల మంజూరు కావాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.6.70 కోట్లు మంజూరయ్యాయి. మిగతా బిల్లులు మంజూరైతే నిర్మాణం వేగవంతం అవుతుంది.

- రాధికా లక్ష్మి, పంచాయతీరాజ్ డీఈఈ

ధనుర్మాస మహోత్సవ ఆహ్వాన పత్రిక అందజేత

ధనుర్మాస మహోత్సవ ఆహ్వాన పత్రికను మాజీ మంత్రి హరీశ్‌రావు, పద్మాదేవేందర్‌రెడ్డికి అందజేస్తున్న మధుసూదన్

మెదక్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): మెదక్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయం గోదారంగస్వామి వారి ధనుర్మాస మహోత్సవ ఆహ్వాన పత్రికను పలువురు ప్రముఖులకు సోమవారం అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డికి ఆలయ అధ్యక్షుడు కంచి మధుసూదన్ అందజేశారు. జనవరి 10న ముక్కోటి వైకుంఠ ఏకాదశి, ఉత్తర ద్వార దర్శనానికి రావాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, బీఆర్ఎస్ శ్రేణులు ఉన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి: ఎస్పీ

అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, డిసెంబర్ 23: అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు.

రామాయంపేటలో..

రామాయంపేట, డిసెంబర్ 23: ప్రజావాణిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రజినీకుమారి తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిబ్బందికి ఆదేశించారు.

కల్వకుంట రైతుకు ఉత్తమ అవార్డు

ఉత్తమ రైతు అవార్డు స్వీకరిస్తున్న రత్నగారి మానస రాజేశ్వర్‌రెడ్డి

నిజాంపేట, డిసెంబర్ 23: మండలంలోని కల్వకుంటకు చెందిన రైతు రత్నగారి మానస రాజేశ్వర్‌రెడ్డికి ఉత్తమ రైతు అవార్డును నిర్వాహకులు పావనిరెడ్డి, చైర్మన్ రాజేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి అందజేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో జాతీయ ఉత్తమ రైతు అవార్డు గ్రహీతల కార్యక్రమాన్ని నిర్వహించారు.

రామానుజన్ సేవలు మరువలేనివి

మెదక్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ సేవలు మరువలేనివని చైతన్య భారతి కరస్పాండెంట్ జుబేర్ అహ్మద్ అన్నారు. మెదక్‌లోని చైతన్య భారతి పాఠశాలలో సోమవారం గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీధర్, మోహన్ పాల్గొన్నారు.

నేడు నర్సాపూర్‌లో క్రిస్మస్ ఫీస్ట్

నర్సాపూర్, డిసెంబర్ 23: నర్సాపూర్‌లోని సాయికృష్ణ గార్డెన్‌లో క్రిస్మస్ ఫీస్ట్ ప్రోగ్రాను మంగళవారం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. క్రిస్టియన్లు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

మల్లయ్య మృతదేహం

కొల్చారం, డిసెంబర్ 23: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ వైరు అమర్చుతుండగా షాక్‌కు గురై రైతు మృతి చెందిన ఘటన సంగాయిపేట గ్రామ శివారులో సోమవారం జరిగింది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రైతు ముకిరే మల్లయ్య(60) తన పొలం వద్ద వరి నారుకు నీరు పెడదామని వెళ్లాడు. ఒక ఫ్యూజ్‌లో కరెంట్ లేకపోవడాన్ని గమనించి ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి చూశాడు. అక్కడ ఒక ఫ్యూజ్ వైర్ తెగిపోయి ఉంది. ఫ్యూజ్ అమర్చుదామని ఏబీ స్విచ్ బంపర్ ఆఫ్ చేస్తుండగా అదుపుతప్పి ట్రాన్స్‌ఫార్మర్‌పై పడ్డాడు. దీంతో విద్యుదాఘాతానికి గురైన మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సత్యమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై మహమ్మద్ గౌస్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాయితీపై గడ్డివిత్తనాలు అందజేత

చిన్నశంకరంపేట, డిసెంబర్ 23: గడ్డివిత్తనాలను 75శాతం రాయితీపై అందుబాటులో ఉంచామని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల అధికారి గీతామాలిక సోమవారం ప్రకటనలో సూచించారు. రైతులు ఆధార్‌కార్డు, కులధృవీకరణ పత్రం తీసుకొని చిన్నశంకరంపేటలోని పశువైద్య కేంద్రానికి రావాలని సూచించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సిద్దిరాములు (ఫైల్)

చిన్నశంకరంపేట, డిసెంబర్ 23: మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని మిర్జాపల్లిలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మిర్జాపల్లి గ్రామానికి చెందిన చింతల సిద్దిరాములు(45) కొన్నేండ్లుగా మద్యానికి బానిసై ఇంట్లో గొడవలకు పాల్పడేవాడు. ఆదివారం రాత్రి ఇంట్లో గొడవపడి ఇంటి పక్కనున్న కరెంటు స్తంభానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై నారాయణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

FOR SALE

★Prime properties for sale at Siddipet Please contact : 9299008929, 6304851467, 8185855813

NT-99351

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

రామాయంపేట, డిసెంబర్ 23: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బైరం కుమార్ హెచ్చరించారు. సోమవారం మెదక చౌరస్తా వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయికి మోడల్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

నర్సాపూర్, డిసెంబర్ 23: మండలంలోని జక్కపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థినులు ఖోఖోలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఫర్హానా పేర్కొన్నారు. నర్సాపూర్ మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్ ఖోఖో మహిళలు, పురుషుల విభాగంలో ఆదివారం ఎంపికయ్యారని తెలిపారు. మోడల్ స్కూల్ నుంచి ఏడుగురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వరంగల్ జిల్లా గీసుకొండలో జనవరి 8, 9, 10 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ఫర్హానా, పీడీ అశోక్, టీచర్లు అభినందించారు.

ఆటలతో క్రమశిక్షణ అలవడుతుంది

మాట్లాడుతున్న బీఆర్ఎస్ యువత అధ్యక్షులు తునుకుల పల్లి సంతోష్ రావు

కొల్చారం, డిసెంబర్ 23: ఆటలతో శారీరక దారుఢ్యం, మానసిక ఎదుగుదల, సృజనాత్మకత పెంపొందుతుందని బీఆర్ఎస్ యువత అధ్యక్షుడు టీ.సంతోష్‌రావు అన్నారు. సోమవారం పోతంశెట్టిపల్లిలో ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ స్థాయి వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పోటీలో గెలుపొందిన జట్టుకు కప్పుతో పాటు రూ.10 వేల నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నరేందర్ రెడ్డి, కొమ్ముల యాదగౌడ్, ముత్యంగారి సంతోష్, గౌరీశంకర్, సిద్దిరాములు, రవతేజ రెడ్డి, చట్యాల యాదయ్య, బైకారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

బిల్డింగ్‌పైకి ఎక్కి యువకుడి హల్‌చల్

బిల్డింగ్‌పై ఎక్కి హల్‌చల్ చేస్తున్న యువకుడి

రామాయంపేట, డిసెంబర్ 23: తీసుకున్న అప్పును తిరిగి చెల్లించాలని కోరినా ఇవ్వకుండా కాలయాపన చేయడంతో బాధితుడు సదరు వ్యక్తి బిల్డింగ్‌పైకి ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన రామాయంపేట మండలంలోని అక్కన్నపేట గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రామాయంపేటకు చెందిన భూమ నవీన్ అక్కన్నపేటకు చెందిన తన దగ్గరి బంధువుకు డబ్బులు అప్పుగా ఇచ్చాడు. ఏడాది గడుస్తున్నా డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో కలత చెందాడు. యువకుడు అక్కన్నపేట గ్రామంలో అప్పుగా తీసుకున్న వారి బిల్డింగ్‌పైకి ఎక్కి తనకు డబ్బులు ఇవ్వాలని, లేకుంటే ఇక్కడి నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడుతానని మొండికేశాడు. గ్రామస్తులు, బంధువులు దిగమని బతిమిలాడినా ఎంతకూ దిగకుండా తన అప్పు కట్టేంతవరకు దిగే లేదంటూ 2 గంటల పాటు హల్‌చల్ చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని యువకుడిని సముదాయించి కిందికి దింపారు. యువకుడిని ఆయన బంధువులను ఎస్సై బాలరాజు తమ ఆధీనంలోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టాలి

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించాలని నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

చిన్నశంకరంపేట, డిసెంబర్ 23: కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌కు వెంటనే మరమ్మతులు చేయించాలని రైతులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని చందంపేట ట్రాన్స్‌ఫార్మర్ నెలలో నాలుగు సార్లు కాలిపోతున్నదని, దీంతో ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు పట్టించుకోవడంలేదన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

రామాయంపేట, డిసెంబర్ 23: సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ జిడ్డి ఎల్లం పేర్కొన్నారు. సోమవారం రామాయంపేటలో విలేకరులతో మాట్లాడారు. వారు విధుల్లో లేకపోవడంతో తమ ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నదన్నారు. మండల వనరుల కేంద్రాల్లో ఉద్యోగులు లేకపోవడంతో తమ పనులు కావడం లేదన్నారు. ప్రభుత్వం మొండి వైఖరిని వీడి సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు.

ఉద్యోగుల డీఏలు చెల్లించాలి

మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు మాధవ్‌చారి

అల్లాదుర్గం, డిసెంబర్ 23: పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల డీఏలు వెంటనే చెల్లించాలని పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాధవ్‌చారి అన్నారు. సోమవారం అల్లాదుర్గం ఎంపీడీవో కార్యాలయంలో అల్లాదుర్గం యూనిట్ వార్షిక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నాలుగు డీఏలు, పీఆర్సీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అల్లాదుర్గం యూనిట్ అధ్యక్షుడు శంకర్, ఎంపీడీవో చంద్రశేఖర్, రేగోడ్, శంకరంపేట సూపరింటెండెంట్లు రమేశ్, షాకీర్ అలీ, సిబ్బంది చంద్రశేఖర్, రవీందర్, రాజ్‌కుమార్, సజ్జాద్ అలీ పాల్గొన్నారు.

మానవత్వం చాటిన ఉపాధ్యాయులు

విద్యార్థి చికిత్సకు ఆర్థిక సాయం అందజేస్తున్న టీచర్లు

వెల్దుర్తి, డిసెంబర్ 23: మండలంలోని యశ్వంతరావుపేట గ్రామానికి చెందిన బ్యాగరి వంశీ మంగళపర్తి జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 19న పాఠశాల నుంచి గ్రామానికి వస్తు చౌరస్తా, వెల్దుర్తి-నర్సాపూర్ ప్రధాన రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై హైదరాబాద్‌లోని దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. మంగళపర్తి ఉపాధ్యాయులు రూ.40 వేలు, పలువురు ఇతర ఉపాధ్యాయులు రూ.63 వేల విరాళాలు ఇచ్చారు. వీటిని మంగళపర్తి పాఠశాలలో వంశీ తండ్రి శ్రీనివాస్‌కు సోమవారం అందజేశారు. ఆర్థిక సాయం చేసిన ఉపాధ్యాయులకు మంగళపర్తి ఉపాధ్యాయుడు రామాగౌడ్, ఎంఐఎస్ నవీన్ కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

చిన్నశంకరంపేట, డిసెంబర్ 23: మండలంలోని చందంపేట సహకార సంఘంలో పటేల్, విజయ్‌కుమార్ గతంలో సెక్రెటరీగా పని చేస్తూ అనారోగ్యంతో మృతి చెందాడు. సంఘం నుంచి రావాల్సిన బెనిఫిట్ రూ.2లక్షల 39వేల చెక్కును పటేల్ విజయ్‌కుమార్ భార్య మహేశ్వరికి సింగిల్‌విండో చైర్మన్ సత్యనారాయణ అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శివకుమార్‌గౌడ్, డైరెక్టర్ పోచాగౌడ్, రామకృష్ణ తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

చిలిపిచెడ్, డిసెంబర్ 23: నర్సాపూర్‌లోని క్యాంప్ కార్యాలయంలో చిలిపిచెడ్ మండలంలోని చిట్కుల్‌కు చెందిన పోచయ్యకు రూ.25 వేలు, టి.కృష్ణమూర్తికి రూ.60వేలు, చిలిపిచెడ్‌కు చెందిన తలారి బాల్‌రాజ్‌కు రూ.20 వేలు, శీలాంపల్లికి చెందిన హనుమ్మంత్‌రెడ్డికి రూ.50 వేలు, రాందాస్‌గూడకు చెందిన ఆకుల వెంకయ్యకు రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట, డిసెంబర్ 23: మండలంలోని శాలిపేటలో సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. పచ్చంటి యాదమ్మకు రూ.18,500ల చెక్కు అందించారు.

ఏఐబీఈఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా కిషన్



మెదక్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): ఆలిండియా బంజారా ఎంప్లాయీస్ సేవా సంఘ్ (ఏఐబీఈఎస్ఎస్) జిల్లా నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎల్.కిషన్, ప్రధాన కార్యదర్శిగా ఎన్.రమేశ్, గౌరవాధ్యక్షుడిగా తారా సింగ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా చరణ్‌సింగ్, ఉపాధ్యక్షులుగా గోపాల్, హీరాలాల్, దేవులా, తులసీలు ఎన్నికయ్యారు. ప్రచార కార్యదర్శులుగా హీరా, లింబాద్రి, సుమ, సాంస్కృతిక కార్యదర్శిగా మదన్, సరళ, గౌరవ సలహాదార్లుగా డాక్టర్ అమర్‌సింగ్, శంకర్, చక్రుసింగ్ ఎన్నికయ్యారు. సంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భోజరాజ్ జాదవ్, రవీందర్, పర్యవేక్షకులుగా చరణ్, దేవీసింగ్, రాథోడ్ సమక్షంలో నిర్వహించారు. కార్యక్రమంలో మెదక్ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రతన్, గబ్బర్‌సింగ్, కమిటీ సభ్యులు, తూప్రాన్, రామాయంపేట, నర్సాపూర్, శంకరంపేట బాధ్యులు పాల్గొన్నారు.

రేపు మెదక్‌కు సీఎం రాక

కొల్చారం, డిసెంబర్ 23: సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 25న జిల్లా పర్యటనకు రానున్నట్లు ఎమ్మెల్యే రోహిత్ రావు, కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. మండలంలోని పోతంశెట్టిపల్లి శివారు ప్రాంతం, ఏడుపాయల దుర్గాభవానీ ఆలయ ప్రాంగణంలో సీసీ హెలిప్యాడ్ నిర్మించారు. ట్రాఫిక్ నియంత్రనకు బారికేడ్లు ఏర్పాటు చేయాలని, ఏడుపాయల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వారితో అదనపు కలెక్టర్ నగేశ్, ఆవుల రాజిరెడ్డి, ఆంజనేయులు ఉన్నారు.

ఏసు బోధనలు మార్గదర్శకం

మెదక్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): ఏసు బోధనలు మానవాళికి మార్గదర్శకమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. సోమవారం జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెదక్ మాయ గార్డెన్‌లో నిర్వహించిన క్రిస్టమస్ వేడుకలకు హాజరై కేక్ కట్‌చేశారు. వినయం, కరుణను ఆచరాత్మకంగా చూపించారని ఏసుక్రీస్తును కొనియాడారు.

బీవీఆర్ఐటీలో అంతర్జాతీయ సదస్సు

సదస్సులో పాల్గొన్న ముఖ్య అతిథులు, కళాశాల యాజమాన్యం

నర్సాపూర్, డిసెంబర్ 23: నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాలలో ఫార్మాస్యూటికల్ ఇంజినీరింగ్, హెల్త్‌కేర్ సిస్టమ్స్‌పై ఈ నెల 23, 24న నిర్వహించే అంతర్జాతీయ సదస్సును ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ సంజయ్‌దూబే తెలిపారు. కార్యక్రమానికి జపాన్‌కు చెందిన కుమాంటో యూనివర్సిటీ ప్రొఫెసర్ తాకాసి వాటానాబి, సాగా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ యూకిమో నగానో హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫార్మా, ఇంజినీరింగ్ టెక్నాలజీతో మానవాళి వృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో విశిష్ట అతిథి డా.రచనా త్రిపాఠి, కళాశాల డైరెక్టర్ డా.లక్ష్మీప్రసాద్, మేనేజర్ బాపిరాజు, అసిస్టెంట్ మేనేజర్ అశోక్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో హేమభార్గవి

శివ్వంపేట, డిసెంబర్ 23: చిన్నారులు, తల్లులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సీడీపీవో హేమభార్గవి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. సోమవారం శివ్వంపేట రైతు వేదికలో నర్సాపూర్ ప్రాజెక్టు పరిధిలోని ఆరు మండలాల అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నర్సాపూర్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు, జిల్లా పోషన్ అభియాన్ కోఆర్డినేటర్లు, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

పారదర్శకంగా ఇండ్ల సర్వే చేపట్టాలి

నిజాంపేట, డిసెంబర్ 23: ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీవో రాజిరెడ్డి కార్యదర్శులకు ఆదేశించారు. సోమవారం మండలంలోని చల్మెడలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఎంపీడీవో పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శిలు నర్సింహారెడ్డి, ప్రశాంత్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రామాయంపేటలో..

రామాయంపేట, డిసెంబర్ 23: మండలంలోని సుతారిపల్లి, శివ్వాయపల్లి, ఆర్.వెంకటాపూర్, డి.ధర్మారం తదితర గ్రామాల్లో కార్యదర్శులు ఇంటింటికీ తిరుగుతూ ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేస్తున్నారు. కార్యదర్శులు ప్రకాశ్, ధనలక్ష్మి, మహేందర్ ఉన్నారు.

దుర్గామాతను దర్శించుకున్న దేవాదాయశాఖ కమిషనర్

పాపన్నపేట, డిసెంబర్ 23: ఏడుపాయల వనదుర్గామాతను దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్ బాబు సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 25న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఏర్పాట్లను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించి, పలు సూచనలు చేశారు.

పరిస్థితి విషమించి ఒకరు మృతి

అశోక్ (ఫైల్)

తూప్రాన్, డిసెంబర్ 23: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఒకరు మృతి చెందిన ఘటన తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ-2 యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. పోతరాజ్‌పల్లికి చెందిన పల్లపు అశోక్ (39) బండరాళ్లు అమ్ముకుని జీవిస్తున్నాడు. ఈనెల 10న తన హోండా యాక్టీవాపై టోల్‌గేట్ వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో 44వ నెంబర్ జాతీయ రహదారి కరీంగూడ అండర్ బ్రిడ్జి వద్దకు రాగానే తూప్రాన్ వైపునకు వస్తున్న టీఎస్35 టీ 0697 నెంబర్ గల బజాజ్ ట్ర